

## సంపూర్ణ విధేయతకు ప్రతిరూపం

# ఆ మహనీయుని జీవితం

-అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ

అంతే. ఓ పెద్ద అగ్ని గుండం రగిలించబడుతుంది. దైవ ప్రవక్త ఇబ్రాహీంను భగభగమండే అగ్ని గుండంలో విసిరి వేయడం జరిగింది. జీవన్మరణాలకు అధిపతి అయిన అల్లాహ్ **"ఓ అగ్నీ! నా నేస్తం ఇబ్రాహీం కోసం చల్లారిపో, క్షేమకరంగా మారిపో"** అని ఆదేశిస్తాడు. మండే జ్వాలలు ఆరిపోతాయి. ఇబ్రాహీం (అలైహిస్సలాం) సురక్షితంగా అగ్ని గుండం నుండి బయటపడతారు. ఈ విధంగా విశ్వప్రభువు దుర్మార్గుల దుష్టప్రయత్నాలను వమ్ము చేసి తన ప్రియదాసుడ్ని కాపాడుతాడు.

జనుల్ని నిజప్రభువు వైపుకు పిలువడమే తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్న ఇబ్రాహీం (అలైహిస్సలాం) స్వస్థలాన్ని కూడా వదలిపెడ్తారు. సిరియా, పాలస్తీనా, ఈజిప్టు ...ఇంకా మరెన్నో ప్రాంతాలలో పర్యటిస్తారు. ప్రజలకు ఏకేశ్వరోపాసనా సందేశాన్ని అందజేస్తూ ఉంటారు. సత్యధర్మ ప్రచార మార్గంలోనే ఆయన ముసలివారయిపోతారు. ముసలితనంలో **"ఓ ప్రభూ! నాకు సచ్ఛీలుడైన ఓ కుమారుడ్ని ప్రసాదించు"** అని ఎంతో దీనంగా అల్లాహ్‌ను వేడుకుంటారు. అల్లాహ్ తన ప్రియదాసుడి మొరను ఆలకించి ఒక బాలుడ్ని అనుగ్రహిస్తాడు. ఆ బాలుడే దైవ ప్రవక్త ఇస్మాయీల్ (అలైహిస్సలాం).

విశ్వప్రభువైన అల్లాహ్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను ఇంకొక కఠిన పరీక్షకు గురిచేస్తాడు. తన భార్య హాజిరాను, ముద్దుల కొడుకు ఇస్మాయీల్‌ను కటిక కొండల్లో వదలిపెట్టి రావాలని ఆజ్ఞాపిస్తాడు. ఎందుకు? అని అడగరు ఆ మహనీయుడు. జనావాసంలేని ఆ ప్రదేశంలో తన భార్యా, పసిపిల్లవాడి సంరక్షణా బాధ్యత ఎవరు వహిస్తారు? అని ఆలోచించరు. తన ప్రభువు ఆజ్ఞను శిరసావహిస్తూ, ఆయన మీదే అపార నమ్మకంతో తన భార్యాబిడ్డను కొండల నడుమ వదలిపెట్టుతారు. కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఆ తల్లీబిడ్డను సంరక్షిస్తాడు. వారి కోసం జమ్ జమ్ నీటి ఊటను సృష్టిస్తాడు. ఈ విధంగా తన ప్రసన్నత కోసం సంబంధ బాంధవ్యాలను త్యజించిన వారికి తాను ప్రపంచ జీవితంలోనూ శుభాలను ప్రసాదిస్తానని, వారి ఊహకు కూడా అందనటువంటి మార్గాల ద్వారా వారికి ఉపాధి అనుగ్రహిస్తానని లోకానికి వెల్లడి చేశాడు.

హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఓ రోజు రాత్రి కలగంటారు - లేక లేక కలిగిన ముద్దుల కొడుకును తన చేతులతోనే దైవమార్గంలో బలి ఇస్తున్నట్లు! ఈ విషయం తన పుత్ర రత్నానికి తెలియజేస్తారు. పసితనం నుంచే దైవ విధేయతాభావం, త్యాగభావాన్ని పుణికి పుచ్చుకున్న ఆ బాలుడు ఏ మాత్రం చలించకుండా ఇలా అంటాడు: **"నాన్నా ! ఇదే దైవాజ్ఞ అయితే మీకు లభించిన ఆదేశాన్ని మీరు నిస్సందేహంగా అమలుపరచండి. ఇన్షా అల్లాహ్ (దైవం తలిస్తే) మీరు నన్ను సహనశీలిగా చూస్తారు".**

ఇప్పుడు అల్లాహ్ ఆజ్ఞను శిరసావహిస్తూ కన్న కొడుకుని బలివ్వడానికి తండ్రి సిద్ధమయ్యాడు. దైవ ప్రసన్నత కోసం బలి అవడానికి బిడ్డ అంగీకరించాడు. నిస్సందేహంగా ఇదొక కఠిన పరీక్ష. గొప్ప త్యాగం. ఇబ్రాహీం (అలైహిస్సలాం) కొడుకుని బోర్లా పడవేస్తారు. అప్పుడు అల్లాహ్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను పిలిచి **"ఓ ఇబ్రాహీం! నీవు కలను నిజంచేసి చూపావు"** అంటాడు. ఈ పెద్ద ఖుర్బానీకి పరిహారంగా పొట్టేలను ఇచ్చి ఇస్మాయీల్(అ) ను తప్పిస్తాడు. తండ్రి కుమారులకు భావితరాలలో శాశ్వతంగా కీర్తి ప్రతిష్ఠలను ప్రసాదిస్తాడు.

ఈ విధంగా దైవప్రవక్త ఇబ్రాహీం (అ) మనసా, వాచా, కర్మణా తాను తన తల్లిదండ్రులు, ఆప్తులు, భార్యాబిడ్డలు, ఆస్తి అంతస్తులు... అన్నిటికన్నా ఎక్కువగా అల్లాహ్‌ను ప్రేమిస్తున్నానని, ఆయన ప్రసన్నత కోసం మనోకాంక్షల్ని, ప్రాపంచిక వ్యామోహాన్ని, బాంధవ్యాలను త్యజించడానికి, తాను ఎల్ల వేళలా సంసిద్ధమేనని లోకానికి వెల్లడి చేశారు.

అందుకే అల్లాహ్ ఆ మహామనీషిని సమస్త మానవులకు నాయకునిగా ఎన్నుకున్నాడు. "ముస్లిం (సంపూర్ణ విధేయుడు) అనే బిరుదును ఆయనకు అనుగ్రహించాడు.

దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) త్యాగమయ జీవితంలో వంశపారంపర్యంగా వస్తున్న ముస్లిములకు, నవ ముస్లిములకు గొప్ప సందేశం ఉంది. ఉత్తమ ఆదర్శముంది.

**(1)** విగ్రహారాధకుల కుటుంబంలో జన్మించినప్పటికీ విశ్వప్రభువైన అల్లాహ్‌ను తన నిజ యజమానిగా, పోషకునిగా, సంరక్షకునిగా స్వీకరించినవారు, ఆయనకు విధేయత చూపేవారు ముస్లిములుగానే పరిగణించబడతారు.

**(2)** ధనవ్యామోహపరులు, పదవుల కోసం ప్రాకులాడేవారు, మనోవాంఛలకు బానిసలయినవారు, బూటకపు గౌరవప్రతిష్ఠల కోసం వెంపర్లాడే వారు, అంధవిశ్వాసాలను అంటిపెట్టుకొని ఉండేవారు, లోకం దృష్టిలో ముస్లింలుగా చెలామణీ అవుతారేమోగాని అల్లాహ్ దృష్టిలో మాత్రం ముస్లిములుగా లెక్కించబడరు.

**(3)** అల్లాహ్ ఆదేశాలను శిరసావహిస్తే లేక ఫలానా దైవాజ్ఞను పాటిస్తే పెద్దలు ఒప్పుకోరని, తల్లిదండ్రులు వ్యతిరేకిస్తారని, ప్రభుత్వానికి కోపం వస్తుందని, కష్టనష్టాలకు గురికావలసి వస్తుందని, వ్యాపారం మందగిస్తుందని, ఆదాయం తగ్గిపోతుందని, ఉద్యోగం ఊడిపోతుందని, భార్యా పిల్లల కోర్కెలను తీర్చలేమని అనే వారికి తాము ముస్లిములమని చెప్పుకునే హక్కు లేదు. **"ముస్లిం"** అంటేనే అల్లాహ్ తరఫు నుండి లభించే ప్రతి ఆదేశాన్నీ శిరసావహించేవాడు.